# ఎన్నికల కోడ్ కట్టుదిట్టంగా అమలు చేయాలి



- 24 గంటల్లో ప్రభుత్వ ఆఫీసులో ఉన్న రాజకీయ నాయకుల ఫోటోలను తొలగించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

వికారాబాద్ జిల్లా అక్టోబర్ 9 జనవాహిని ప్రతినిధి :- భారత ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో వెంటనే ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుందని, దీనిని కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు.సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఇతర రాష్ట్ర స్థాయి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు 2023 కు షెడ్యూల్ విడుదల చేసిందని, రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని,24 గంటల వ్యవధిలో ప్రతి ప్రభుత్వ భవనాలలో వివిధ రాజకీయ పార్టీలకు, నాయకులకు సంబంధించిన హోర్డింగులు,నాయకులఫోటోలు,వాల్‌రైటింగ్స్‌తొలగించాలని,48 గంటల వ్యవధిలో పబ్లిక్ ప్రాపర్టీస్ వద్ద హోర్డింగులు, ఫ్లెక్సీలు ఫోటోలు తొలగించాలని,ప్రైవేట్ స్థలాలో ఉన్న హోర్డింగులు,ఫ్లెక్సీలు,ఫోటోలను72గంటల్లో తొలగించాలని ఆయన అధికారులకు ఆదేశించారు.రాష్ట్రంలో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల వెబ్ సైట్, జిల్లా వెబ్ సైట్ లలో మంత్రుల ఫోటోలు, ముఖ్యమంత్రి ఫోటోలను తొలగించాలని అన్నారు. రాజకీయ పార్టీలు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలకు ర్యాలీలు, సభల నిర్వహణకు అనుమతులు నిబంధనల ప్రకారం ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ విధానంలో జారీ చేయాలని ఆయన సూచించారు.నవంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతుందని, అప్పటి వరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు,కంట్రోల్ రూమ్ ఏర్పాటు, మీడియా సెంటర్ ఏర్పాటు, ఎన్నికల విధుల నిర్వహణకు సిబ్బంది శిక్షణ, తదితర కార్యక్రమాలు పూర్తి చేయాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ వివరాలు సమర్పించాలని అన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు అనుమతి అదే రోజు అందించే విధంగా ఎంసిఎంసి పని చేయాలని అన్నారు. శాంతి భద్రతలు కట్టుదిట్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎన్నికలకు సంబంధించి రిపోర్ట్ లు ప్రతి రోజూ సమర్పించే విధంగా జిల్లాలో వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు.జిల్లాలో దివ్యాంగుల ఓటర్లను పోలింగ్ కేంద్రాల వారిగా మ్యాపింగ్ చేసుకోవాలని,ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు,ఇతర ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు సేకరించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సూచించారు.పోలింగ్ కేంద్రాలలో త్రాగునీరు, లైటింగ్ ,ర్యాంపు, నీటి సరఫరాతో కూడిన టాయిలెట్లు మొదలగు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని అన్నారు.నామినేషన్లు స్వీకరించే సమయంలో రిటర్నింగ్ అధికారులకు భద్రత ఏర్పాటు చేయాలని, అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించే సమయంలో నిబంధనలు పాటిస్తూ నామినేషన్ లో అన్ని అంశాలు నింపారో లేదో చెక్ చేసుకోవాలని, నింపని పక్షంలో సదరు అభ్యర్థులకు రాత పూర్వకంగా సమాచారం అందించాలని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీకి చెందిన ప్రతినిధులు ప్రభుత్వ మిషనరీ ఎన్నికల కోసం వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని, ఓటింగ్ స్లిప్పుల పంపిణీ నామినేషన్ల ముగింపు తేది అనంతరం నుంచి చేపట్టాలని అన్నారు.ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, వికారాబాద్ తాండూర్ ఆర్డీఓలు విజయ కుమారి, శ్రీనివాసరావు తదితరులుపాల్గొన్నారు.




## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
## ఏరియా సర్వే అధికారి





పెద్దపల్లి రామగిరి (జనవాహిని స్టాఫ్ రిపోర్టర్ అల్లేపు రమేష్) :- పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఏరియా సర్వే అధికారి జైనులా బద్దిన్ అన్నారు. స్వచ్ఛత పక్వాడా లో భాగంగా శుక్రవారం స్థానిక సెంటినరీ కాలనీలోని ఆర్వో ప్లాంట్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చెత్తను శుభ్రం చేయడము, పిచ్చి మొక్కలను తొలగించడం జరిగినది.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ పర్యావరణ అధికారి బి.వి.సత్యనారాయణ, సర్వే అధికారి టి వెంకటేశ్వర్లు, సివిల్ సూపర్వైజర్ యాకూబ్ పషా తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్జీ3 జిఎం



పెద్దపల్లి రామగిరి(జనవాహిని స్టాఫ్ రిపోర్టర్ అల్లేపు రమేష్) :- పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీ వి.లక్ష్మి నారాయణని, నూతనంగా ఆర్జీ3 ఏరియా జీఎంగా బాధ్యతలను చేపట్టిన శ్రీ ఎన్.సుధాకర్ రావు శుక్రవారము మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్చాన్ని అందజేసి పరిచయం చేసుకున్నారు.ఆర్జీ3 ఏరియాలో గనుల విస్తరణ కోసం రెవెన్యూ పరంగా ఉన్న పనులకు వారి సహాయ ,సహకారాలను అందించాలని జిఎం కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఎస్టేట్స్ అధికారి కె. ఐలయ్య, సీనియర్ సెక్యూరిటీ అధికారి ఈ. లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

# చిగురు మామిడి పరిధిలోని ప్రజలందరికి పోలీస్ వారి విన్నపము



చిగురుమామిడి జనవాహిని రిపోర్టర్ చిట్యాల భానుబాబు) :- విద్యుత్ వినియోగ దా మరియు రైతు సోదరులకు ముఖ్య గమనిక :-

- తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన సందర్భంగా భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మీ దగ్గరలో కానీ, మీ ఇంటిలో కానీ, తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోకండి.
- ఆరుబయట విద్యుత్ స్థంభాలను తాకకండి మరియు రైతులు ట్రాన్స్ఫార్మర్ ల దగ్గరికి వెళ్ళకండి.
- మీ యొక్క స్టార్టర్ డబ్బాలను నీటిలో తడవకుండా పైకి ఏర్పాటు చేసుకోగలరు.
- స్టార్టర్ డబ్బాలు ఇనుపవి కాకుండా పివిసి డబ్బాలను ఏర్పాటు చేసుకోండి.
- పాత మట్టిగోడల ఇండ్లలో నివాసం ఉండరాదు. కూలే అవకాశం ఉన్నవాటికి దూరంగా ఉండండి.
- వాగులు, కాలువలు వరద ప్రవాహంతో ఉన్నందున వాటిని దాటే ప్రయత్నం చేయరాదు.
- నీటిలో ఆడేందుకు సరదాగా వెళ్ళి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్నందున పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండండి.
- మీ కనుచూపు మేర ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు పక్కకు ఒరిగినట్టయితే కరెంటు తీగలు తెగిపడినట్లైతే వెంటనే డయల్ 100 కి కానీ, కరెంటు ఆఫీస్ కి, కానీ మీ ఏరియా లైన్ మాన్ కి కానీ, మీ ఏఈకి కానీ తెలిజేయగలరు ఎస్ రాజేష్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ చిగురు మామిడి కరీంనగర్ జిల్లా పత్రిక ప్రకటనలోతెలిపారు..